క్లుప్తంగా

ఎమ్మెల్యే శ్రీహరికి ఆహ్వానం



రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబుతో కలిసి హనుమకొండలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానించగా సానుకూలంగా స్పందించారని గౌడ సంఘం నాయకులు తెలిపారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుర్ర ఉప్పలయ్య, బాల్నె వెంకటమల్లయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



పాలకుర్తి: శాతాపురం గ్రామానికి చెందిన కొండూరి నర్సయ్య అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, గ్రామ కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి చికిత్స నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. కాగా, శుక్రవారం బాధిత కుటుంబానికి నాయకులు ఎల్‌ఓసీ అందజేశారు.

ఆర్థికసాయం



పాలకుర్తి టౌన్: గుండెపోటుతో మృతి చెందిన దేవరుప్పుల ఈజీఎస్ ఎంపీఎం కమ్మగాని శ్రీనివాస్ కుటుంబానికి శుక్రవారం మండల కేంద్రంలో జిల్లాలోని ఉపాధి హామీ సిబ్బంది అందజేసిన రూ. 1,05,000 సాయాన్ని డీఆర్‌డీఓ వసంత చేతుల మీదుగా మృతుడి భార్య శ్రీవాణికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక నిరంతర విద్యుత్



పాలకుర్తి: మండలంలోని వల్మిడి గ్రామంలో ఇక నుంచి నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ రాంబాబు అన్నారు. శుక్రవారం విద్యుత్ అంతరాయం నివారించేందుకు అదనపు నూతన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ఎంఆర్‌టీడీఈ విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్ఈ సుమన్, ఏడీఈ పీఎల్‌కే శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

జనగామ: బతుకు దెరువు కోసం వచ్చిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హస్నా జిల్లా సల్గామే మండలం అగనాల్ గ్రామానికి చెందిన లతా మణి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో బేకరీ నడిపించుకుంటూ బతుకుతున్నారు. అక్కడ వ్యాపారం నడవక పోవడంతో నాలుగు నెలల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చి సూర్యాపేట రోడ్డులో కొత్తగా బేకరీ ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ కూడా వ్యాపారం అంతంత మాత్రంగానే ఉండడం, ఆర్థిక పరిస్థితులు క్షీణించి పోవడంతో మనస్తాపానికి గురయ్యారు. బేకరీలో ఉన్న అల్లుడు బయటకు వెళ్లి వచ్చే సరికి, అత్త లతా మణి అందులోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి పంపించారు. కర్ణాటకలో ఉన్న ఇతర కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, మృతురాలి కొడుకు వచ్చిన తర్వాత పిటిషన్ ఇస్తారని ఎస్సై తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో సీపీఎం నాయకుల నిరసన



జనగామ రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి నెట్‌వర్క్: భారత ఎన్నికల కమిషన్(ఈసీ) కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్రమోదీకి తొత్తుగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలు ధరించి సీపీఎం నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో ఓట్ల సవరణ పేరుతో 65 లక్షల ఓట్లను తొలగించినందుకు నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఓట్ల తొలగింపు అప్రజాస్వామికమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

జనగామ: శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో..



జనగామ: గుండ్లగడ్డ ఉమామహేశ్వర ఆలయంలో..



నర్మెట: వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు






పాలకుర్తి టౌన్: సోమేశ్వరాలయంలో..

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో మహిళలు ఘనంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి గాజులు, పసుపు కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో..



బచ్చన్నపేట: కొడవటూర్ సిద్ధేశ్వరాలయంలో..



చిల్పూరు: వ్రతంలో పాల్గొన్న మహిళలు



రఘునాథపల్లి శివాలయంలో..



దేవరుప్పుల: వాసవీమాత ఆలయంలో..

రహదారిపై మోకాలి లోతుకు పైగా నీరు

● ట్రాఫిక్‌జామ్.. శ్రమించిన పోలీసులు

రఘునాథపల్లి: భారీ వర్షంతో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని రఘునాథపల్లి ఆర్‌వీఎస్ వద్ద గురువారం రాత్రి వరద నీరు ముంచెత్తింది. మోకాలి లోతుకు పైగా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రహదారి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో డ్రెయినేజీలు మూసుకు పోవడం, కల్వర్టులో చెత్తా చెదారం నిండటంతో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి వర్షంలోనే ట్రాఫిక్ క్లియర్ చేశారు. శుక్రవారం జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేష్ సిబ్బందితో కలిసి పొక్లెయినర్‌తో ఇరువైపులా డ్రెయినేజీలలో నిండిన రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా, చెదారాన్ని తొలగించారు. ఏఎస్సై బత్తిని కట్టమల్లు, పంచాయతీ కార్యదర్శి బాలకిషన్, కారోబార్ అజ్మత్ ఉన్నారు.



డ్రెయినేజీలను పొక్లెయిన్‌తో మరమ్మతు చేయిస్తున్న సీఐ, ఎస్సైలు

అలుగు పోస్తున్న చెరువులు

రఘునాథపల్లి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ కారణంగా చెరువులు అలుగులు పోస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మండలగూడెం మల్లిక చెరువు శుక్రవారం అలుగు పోస్తుండగా వారు కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి మత్తడి వద్ద పసుపు, కుంకుమ గంగాదేవికి సమర్పించి పూజలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నామాల బుచ్చయ్య, తోటకూరి రమేష్, ఉత్తెపు సత్యనారాయణ, డ్యాగల రాజశేఖర్, బొల్ల కుమార్, రఘుపతి, చంద్రయ్య, లక్ష్మణ్, మస్తాన్; వెంకటేష్, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.



చెరువు వద్ద పూజలు చేస్తున్న రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బచ్చన్నపేట బ్రాంచ్ మేనేజర్ గోపీనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బ్యాంక్ ఆవరణలో సీబీఐ బ్యాంక్ వ్యవస్థాపకులు స్వరాజ్‌జీ పోచ్‌కస్‌రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్‌జీ ముంబాయిలో చిన్న బ్రాంచ్‌తో స్థాపించి బ్యాంకు నేడు అనేక బ్రాంచీలను కలిగి అంచలంచెలుగా ఎదిగిందని అన్నారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే బ్యాంకు ధ్యేయమన్నారు.



స్వరాజ్‌జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీఎం

హామీ ప్రకారం పింఛన్లు పెంచాలి

కొడకండ్ల/దేవరుప్పుల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల, చేయూత పింఛన్లను ప్రభుత్వం పెంచాల్సిందేనని ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం కొడకండ్ల, దేవరుప్పుల మండలకేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీని నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తుందని, పింఛన్లను పెంచే దాకా పద్మశ్రీ మందకృష్ణ సారథ్యంలో పోరాడుతామని, ఈ నెల 12న పాలకుర్తికి మందకృష్ణ వికలాంగుల మహాసభకు హాజరవుతారని ఆయన తెలిపారు. నాయకులు కిషోర్‌మాదిగ, సుధాకర్, వెంకటేష్, మౌలాలీ, రవి, రామకృష్ణ, కవిత, సోమయ్య, ధరావత్ స్వామి నాయక్, ఉప్పుల కొండయ్య, బొట్ల మహేష్ పాల్గొన్నారు.

నాలా పనులు పూర్తి చేయండి



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ: పట్టణంలోని హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో గార్లకుంట వరకు చేపట్టిన అండర్ డ్రెయినేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, మేకల రాంప్రసాద్, జూకంటి శ్రీశైలం, ధర్మపురి శ్రీను వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల రాజు, నాయకులు పాల్గొన్నారు.

సోదరభావంతో దేశం, ధర్మాన్ని రక్షిద్దాం

● వివేకానంద సేవాసమితి ట్రస్టు అధ్యక్షుడు బాలసిద్దయ్య

జనగామ: దేశం, ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో మనమంతా సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని వివేకానంద సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు మేక బాలసిద్దయ్య పిలుపునిచ్చారు. రాఖీ పండగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన రక్షాబంధన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన ధర్మాన్ని రక్షించాలనే సందేశంతో రక్షాబంధన్ జరుపుకోవడం జరుగుతుందన్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్, ఫకీరు యాదగిరిరెడ్డి, బండి రాజుల శంకర్, రమాదేవి, మోతే సురేందర్‌రెడ్డి, వసంత, ఆరుట్ల దశమంతరెడ్డి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, ఇట్టబోయిన రాజు, అన్నెబోయిన సత్యం, విద్యార్థులు ఉన్నారు. అలాగే బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్ రాజయోగిని బీకే నిర్మల రాఖీ వారోత్సవాలను పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, ఆర్డీఓ గోపీరామ్, డీఎస్పీ రాజమహేంద్రనాయక్, తహసీల్దార్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఇతర అధికారులకు రాఖీ కట్టారు. ఏబీవీపీ జనగామ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కళాశాలల్లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు తోట హృతిక్‌సాయి తదితరులు పాల్గొన్నారు. కాగా, దేవరుప్పుల మండలంలోని ప్రశాంతి విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ పాండుకృష్ణ, లింగాలఘణపురంలోని పీవీఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్షాబంధన్‌ను నిర్వహించారు.



మాట్లాడుతున్న బాలసిద్ధయ్య



అదనపు కలెక్టర్‌కు రాఖీ కట్టి జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మకుమారీలు



డీఎస్పీకి రాఖీ కడుతూ..

మమతానురాగాల రక్షాబంధన్

నర్మెట: అమ్మానాన్నల ప్రతిరూపమే అన్నయ్యలని, మమతానురాగాలకు మారుపేరే సోదరులని, తీపిజ్ఞాపకాలతో నిండినదే రక్షాబంధన్ అని కొత్తకోట జయలక్ష్మి, పూసపల్లి సరస్వతి, గాదం శెట్టి రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన చౌడవరపు కొత్త శంకరయ్య కూతుర్లు గత నలభై ఏళ్లుగా నలుగురు సోదరులకు రాఖీలు కడుతున్నామని, ఆ మధురాను భూతిని మాటల్లో చెప్పలేమని ఆనందం వ్యక్తం చేశారు. వివాహలై అత్తవారింటికి వెళ్లినాగాని ఏ ఒక్కసారికూడా సోదరులకు రాఖీ కట్టడం మరవలేదని తెలిపారు. దేవుడు చల్లంగా చూస్తే జీవితకాలం పండుగను ఘనంగా జరుపుకోవాలన్నదే తమకోరికని అన్నారు.



సోదరులకు రాఖీలు కడుతున్న అక్కలు, చెల్లెలు (ఫైల్)

పురపాలిక ఉన్నా.. పోలీసులదే బాధ్యత

జనగామ: జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తా జంక్షన్‌లో రోడ్డుపై రెండు, మూడు చోట్ల ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే బైకిస్టులు పల్టీలు కొడుతుండగా, కార్లు అదుపు తప్పుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు పురపాలిక అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అయినా పట్టించుకోక పోవడంతో ఎస్సై చెన్నకేశవులు ఆదేశాల మేరకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఎండీ ఫైజ్, ఎస్.ని రంజన్, ఎ.నరేష్ ఆధ్వర్యంలో సిమెంటు, కంకర తెప్పించి ప్రమాదకర గుంతలను పూడ్చి వేసి తమలోని మానవత్వాన్ని చాటుకున్నారు. నిత్యం ట్రాఫిక్ డ్యూటీ చేస్తూ అమాయక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూసి తట్టుకోలేని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ఒక సమస్యకు పరిష్కారం చూపించారు. ఇకనైనా పురపాలిక అధికారులు కళ్లు తెరిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.



గుంతను పూడ్చి వేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు

కాటేజ్ నిర్మాణానికి భూమి పూజ



కాటేజ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఝాన్సీరెడ్డి దంపతులు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రాజేందర్‌రెడ్డి దంపతులు శుక్రవారం ఆలయాన్నికి వచ్చే భక్తులకు విశ్రాంతి, వసతి కల్పించేందుకు రూ. 40లక్షల వ్యయంతో నిర్మించే కాటేజ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం పెండ్లి రోజు సందర్భంగా స్వామిరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలో పెళ్లిరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, హమ్యనాయక్, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, పోగు శ్రీనివాస్,సురేష్‌నాయక్, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకోవడం సరికాదు'

చిల్పూరు: బీసీల 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకోవడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు అడ్డుకోవడం పట్ల సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ బీజేపీ అడ్డదారిలో అధికారంలోకి రావడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కే ప్రయత్నంలో భాగంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు ముస్లిలు ఉన్నారంటూ ఆపుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో బొట్టు కర్ణాకర్ అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

శుభ్రమైన భోజనం వడ్డించాలి

తరిగొప్పుల: విద్యార్థులకు మెనూ ప్రకారం శుభ్రమైన భోజనాన్ని వడ్డించాలని ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?

నర్మెట: ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల శ్రద్ధ కొరవడిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల శేఖర్ అన్నారు. మండల కార్యదర్శి ప్రజ్ఞాపురం నర్సింహులుతో కలిసి వెల్దండలో శుక్రవారం వాడవాడలా పర్యటించిన ఆయన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మురుగు కాల్వలు, దారుల వెంట గడ్డి, పిచ్చి మొక్కలు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు.

విజయవంతం చేయండి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈనెల 11న హనుమకొండ వెయ్యిస్తంభాల గుడి నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుగులోతు రాములునాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించాడానికి ఒక కమిటీ వేయాలని, ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, జార్ఖండ్ తరహాలో నెలకు రూ.25 వేలు పెన్షన్ తదితర సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

చిల్పూరు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్‌ను పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి మండలంలో పేరుకపోయిన భూ సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పైస రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల కుమారస్వామి, మహిళా సంఘం కార్యదర్శి వంగ ప్రేమలత, పిట్టల అంజయ్య, ఎల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: చంద్రుతండా గ్రామానికి చెందిన భూక్య జయ అనే మహిళా రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఏడాది క్రితం మృతిచెందగా మృతురాలి కుటుంబానికి తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచి నుంచి రూ.20లక్షలు విలువైన బీమా చెక్కును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంకు మేనేజర్ నెహ్రూ మాట్లాడారు. ఖాతాదారుల కుటుంబాలకు బీమా ఎంతగానో దోహదపడుతుందన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

దేవరుప్పుల: మూడు దశాబ్దాల పైచిలుకు పౌరసేవలు అందించిన రేషన్ డీలర్ వర్ధమాను రాములు అకాల మృతి చెందాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రాములు కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మాదాపురంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ జిల్లెల సుగుణ మృతదేహానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

తీజ్ ఉత్సవాలు



పాలకుర్తి: మండలంలోని నారబోయినగూడెం నల్లిగానితండాలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ హాజరై మాట్లాడారు. మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ మంజుల భాస్కర్, కోల వేణు, పీహెచ్ ప్రభాకర్, మాడవత్ సోమేశ్, మంగ్యా నాయక్, కమలాకర్ రెడ్డి, యువతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో రైతులకు సరిపడ యూరియా నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలానికి ఇప్పటి వరకు 372.8 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ప్రస్తుతం 250 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, సొసైటీ ద్వారా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఏఈఓలు, రైతులు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

లింగాలఘణపురం: మండలంలోని కుందారం–పాలకుర్తి రోడ్డులో పటేల్‌గూడెం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రయాణికులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి రావుల సదానందం డిమాండ్ చేశారు. శుక్రవారం అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. యాదగిరిరెడ్డి, మల్లేశ్, వెంకటేశ్, శోభన్, నర్సిరెడ్డి, సుధాకర్, నాగయ్య, కనకయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

పాలకుర్తి టౌన్: ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న ఎస్ఐఆర్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యర్తల సమావేశం గాయాల బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఫాసిస్టు ప్రభుత్వం బీజేపీ, ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండాను అమలు చేస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి గమ్మడిరాజుల సాంబయ్య, నాయకులు మల్లయ్య, సోమయ్య, కళింగరాజు, సారయ్య, రాజు పాల్గొన్నారు.

అభినందనీయం

దేవరుప్పుల: ఓనమాలు నేర్పిన ప్రాథమిక బడి పురోగతి కోసం పూర్వ విద్యార్థులు తోడ్పాటు అభినందనీయని హెచ్ఎం అంబటి అంజయ్య అన్నారు. శుక్రవారం సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 2009–10 బ్యాచ్ విద్యార్థులు బ్యాగులు అందించారు. పూర్వ విద్యార్థులు ఆకుల పృథ్వీ, వారాల అనిల్, జోగు మహేందర్, నోముల సతీష్, కుసుసోతు భాస్కర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తరిగొప్పుల: ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యాధికారి దేవేంద్రబాబు అన్నారు. పోతారం గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తరిగొప్పుల: టీబీ ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, టీబీ వ్యాధి భారిన పడకుండా జాగ్రత్త పడాలని హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, టీబీ సూపర్‌వైజర్ చంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొంతగట్టునాగారం ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధికి సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ల్యాబ్ సూపర్‌వైజర్ విశ్వనాథ్, ఎంఎల్‌హెచ్‌పీ తేజస్విని,ఎంపీహెచ్ఎ కళ్యాణి, ఏఎన్ఎం అనిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, ప్రజలు

మత్తడి ధ్వంసం.. మరమ్మతులో జాప్యం

తరిగొప్పుల: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి చెరువులు, కుంటలు ప్రధాన ఆధారం. ఆయకట్టు భూములకు సాగు నీటిని అందించడంతో పాటు భూగర్భజల మట్టాల వృద్ధిలో వాటిదే కీలకపాత్ర. అట్టి చెరువులు, కుంటల మత్తళ్లు ధ్వంసమైనా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామ పరిధిలోని ఈదుళ్ల చెరువు మత్తడి ధ్వంసమైన మరమ్మతులు చేసే వారే కరువయ్యారు. దీంతో చేసేది లేక ఆయకట్టు రైతులే ట్రాక్టర్లతో మత్తడి పూర్తిగా ధ్వంసం కాకుండా మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేశారు.



రైతులు తాత్కాలికంగా మరమ్మతు చేసిన మత్తడి